క్లుప్తంగా

నేడు శిల్పారామంలో సెమీ క్రిస్మస్

కడప కల్చరల్ : క్రిస్మస్ పండుగ ముందస్తు వేడుకల్లో భాగంగా కడప శిల్పారామంలో సెమీ క్రిస్మస్ నిర్వహించనున్నారు. ఆదివారం సాయంత్రం సంప్రదాయ వేదికపై ఈ సందర్భంగా ప్రత్యేక నృత్య ప్రదర్శనలను నిర్వహించనున్నట్లు శిల్పారామం ఏఓ పి.శివప్రసాద్ రెడ్డి తెలిపారు.

నగరాన్ని శుభ్రంగా ఉంచాలి

కడప కార్పొరేషన్ : కడప నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సమిష్టి కృషి అవసరమని కమిషనర్ మనోజ్ రెడ్డి సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2024–25 సంవత్సరానికి మన నగరాన్ని బహిరంగ మల మూత్ర విసర్జన రహిత నగరంగా తీర్చిదిద్దటానికి ఎంపిక చేసిందని, ఇందుకు నగర ప్రజల సహాయ సహకారాలు ఎంతో అవసరమన్నారు. నగరంలో నివాసం ఉన్నవారు, బయట ప్రాంతాల నుండి వచ్చేవారు బహిరంగంగా మల, మూత్ర విసర్జన చేయకూడదని, అలా ఎవరైనా చేసినట్లయితే చట్టపరమైన శిక్షార్హులవుతారన్నారు.

నేడు మెగా బ్లడ్ క్యాంప్

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం పాత కలెక్టరేట్ వద్ద ఆదివారం ఉదయం 9.30 గంటలకు మెగా బ్లడ్ క్యాంపు నిర్వహిస్తున్నామని రాష్ట్ర దూదేకుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు మన్సూరు అక్బర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏపీ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్, నాయకులు, అధికారులు హాజరవుతారన్నారు. 14 సంవత్సరాలుగా తాము క్రమం తప్పకుండా డిసెంబరు 1న రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. యువత ముందుకు వచ్చి రక్తదాన శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘన సన్మానం



రంగస్థల కళాకారులను సత్కరిస్తున్న కార్యక్రమ నిర్వాహకులు

కడప కల్చరల్ : స్థానిక రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో శనివారం వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు మూల మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ధర్మవరం రామకృష్ణమాచార్యులు 112 వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ తొలి తెలుగు స్వతంత్ర నాటక కర్తగా ధర్మవరం రామకృష్ణమాచార్యులు కీర్తింపబడ్డారని తెలిపారు. కవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, డాక్టర్ పాలెం వేణుగోపాల్ మాట్లాడారు. ఈ సందర్భంగా రంగస్థల కళాకారులు కల్లూరు బాల ఎల్లారెడ్డి, డాక్టర్ కొప్పోలు రెడ్డి శేఖర్‌రెడ్డి, అంకిరెడ్డి నారాయణరెడ్డి, పసుపులేటి శ్రీనివాసులు, సి చెన్నారెడ్డి, చంద్రకాంత్ శివయ్య, నట కళా తపస్వి ఏపీఎస్ రాజు, సురతాని నాగన్న, బద్వేల్ కిరణ్ లను సన్మానించారు.

నేడు సీపీఎం నగర మహాసభ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : సీపీఎం కడప నగర 6వ మహాసభ నగరంలోని రామకృష్ణ నగర్‌లో ఆదివారం నిర్వహించనున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి రామ మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ మహాసభలో గత మూడు సంవత్సరాల కాలంలో సీపీఎం చేసిన కృషిని సమీక్షించి భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించడం జరుగుతుందన్నారు. అనంతరం సీపీఎం కడప నగర నూతన కమిటీని ఎన్నుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా సీపీఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఐఎస్ సుబ్బమ్మ హాజరవుతున్నారని ఆయన తెలిపారు. కడప నగరంలో ఉన్న పార్టీ సభ్యులందరూ ఈ మహాసభలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గురజాడ రచనలు అజరామరం



గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నాటక రంగంలో విభిన్న రచనల ద్వారా చైతన్యాన్ని రగిల్చిన అభ్యుదయ కవి గురజాడ అప్పారావు అని డీవైఎఫ్ఐ కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. శనివారం గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాడ అప్పారావు కన్యాశుల్కం నాటకం రచన ద్వారా ఆనాటి పరిస్థితుల్లో మహిళల ఇబ్బందులు, కట్టుబాట్లు కళ్లకు కట్టినట్టు చూపించి ప్రసిద్ధి చెందారన్నారు. ఆయన అనేక రచనల ద్వారా ప్రజలను చైతన్యం చేశారన్నారు. గురజాడ రచనలు అజరామరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహులు పాల్గొన్నారు.

ఖననం చేసేదేలా..?

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప నగరంలోని 48వ డివిజన్ రామరాజుపల్లెలోని ప్రజలకు స్మశాన వాటిన ఉంది. అయితే అందులో నీరు నిల్వ ఉండడంతో పాటు పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో ఎవరైనా మరణిస్తే ఖననం చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని మురుగు నీరంతా ఈ స్మశాన వాటికలోకి చేరి అక్కడ నెలల తరబడి నిల్వ ఉంటోంది. దీనికి తోడు స్మశాన వాటికలోకి వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరణించిన వారిని ఖననం చేసేందుకు గుంత తీస్తే అందులో నీరు వస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్మశాన వాటికలో మురుగు నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని పలుమార్లు నగరపాలక అధికారులకు విన్నవించినా ఎటువంటి ఫలితం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రామరాజుపల్లె స్మశాన వాటికలో మురుగు నీరు నిల్వకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ష్మశాన వాటికలో నిలిచిన మురుగు నీరు



ష్మశాన వాటికలో భారీగా పెరిగిన గడ్డి



రామరాజుపల్లె ష్మశాన వాటికకు వెళ్లేదారిలో ఉన్న చెత్తా చెదారం

మురుగు నీటితో తీవ్ర ఇబ్బందులు..



రామరాజుపల్లె స్మశాన వాటికలో మురుగు నీరు నిల్వ లేకుండా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలి. ఈ స్మశాన వాటికలో వసతులు కల్పించడానికి నిధులు కేటాయించినప్పటికీ టెండరుదారు సక్రమంగా పనులు చేయకుండా మధ్యలోనే ఆపి వేశాడు. దీంతో ఇక్కడ మరణించిన వారిని ఖననం చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– మునెయ్య, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి

సమస్య పరిష్కరించాలి..



రామరాజుపల్లె స్మశాన వాటికలో మురుగు నీరు నిల్వ ఉంటోంది. మరణించిన వారిని పూడ్చాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికై నా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– పైడికాల్వ మేరమ్మ, స్థానికురాలు, రామరాజుపల్లె

నేరాలకు పాల్పడితే చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ హుసేన్

కడప అర్బన్: కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు, హింసాత్మక ఘటనలకు పాల్పడితే చర్యలు తప్పవని కడప టూటౌన్ ఎస్ఐ ఎస్‌కెఎం హుసేన్ తెలియజేశారు. శనివారం సాయంత్రం కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో సీఐ నాగార్జున, ఎస్ఐ ఎస్‌కెఎం హుసేన్‌లు రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వీణా వ్యక్తిత్వం ఉన్నతమైనది

కడప అర్బన్: దివంగత న్యాయవాది వీణా అజయ్‌కుమార్ వ్యక్తిత్వం ఉన్నతమైనదని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం కడపలోని జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదుల సంఘం భవనంలో వీణా అజయ్‌కుమార్ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకటేశ్వరరావు, కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గుర్రప్పనాయుడు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

సోషల్ మీడియా వినియోగంలో నియంత్రణ అవసరం



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్

వైవీయూ: సోషల్ మీడియాను వినియోగించుకునే క్రమంలో స్వీయనియంత్రణ ఎంతో ముఖ్యమని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. శనివారం కళాశాలలో 'సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ బుల్లీయింగ్, సైబర్ నేరాలు'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సోషల్ మీడియా ప్రధానభాగమైందని, దాని వినియోగం సక్రమంగా ఉండాలని, దుర్వినియోగం చేస్తే ఇబ్బందులు తప్పవని సూచించారు. సీసీఎస్ సీఐ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా దుర్వినియోగం వల్ల వ్యక్తిగత గోప్యత, భద్రత ఏ విధంగా దెబ్బతింటుందో వివరించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను అప్రమత్తంగా ఉపయోగించుకోవాలని సూచించారు. వ్యక్తిగత సమాచారం పంచుకునే సమయంలో ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని, సైబర్ నేరగాల్ల వలలో పడకుండా ఉండేందుకు సూచనలు చేశారు.

సైబర్ క్రైమ్ సీఐ మధుమల్లేశ్వరరెడ్డి మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్ పెరుగుతున్న నేపథ్యంలో యువత సైబర్ జాగ్రత్తలు పాటించాలన్నారు. బలహీన పాస్‌వర్డ్‌లు, అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయడం వంటి పొరపాట్లు సైబర్ నేరగాళ్లకు అవకాశం కల్పిస్తాయన్నారు. కార్యక్రమంలో అడ్వకేట్ కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. అంకాల నాగరాజు, శివరామకృష్ణ, మధుసూధన, సుందరేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనలో భాగస్వామ్యం అవుదాం



ర్యాలీలో పాల్గొన్న వైవీయూ అధికారులు, విద్యార్థులు

వైవీయూ: ఎయిడ్స్ నిర్మూలనలో మనమందరం భాగస్వామ్యం అవుదామంటూ యోగివేమన విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. డిసెంబరు 1వ తేదీ ప్రపంచ ఎయిడ్స్ దినం పురస్కరించుకుని శనివారం ముందస్తుగా విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో విద్యార్థుల చైతన్యర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి అనేది హ్యూమన్ ఇమ్యూనోడెఫిసియెన్సీ వైరస్ (హెచ్‌ఐవీ) కారణంగా ఏర్పడుతుందన్నారు. ఈ వ్యాధి శరీరంలోని రోగనిరోధక శక్తిని తగ్గిస్తుందని, దీని వలన శరీరం ఇతర వ్యాధులకు గురవుతుందని తెలిపారు. రక్తమార్పిడి, కలుషిత సిరంజిల ద్వారా ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. రక్త పరీక్షల ద్వారా ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ చేస్తారన్నారు. ఎయిడ్స్ వ్యాధి పట్ల విద్యార్థులు సమాజానికి అవగాహన కల్పించాలని సూచించారు. వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డా. ఎన్. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ వ్యాధి పట్ల మనచుట్టూ ఉన్న సమాజాన్ని చైతన్యం చేయాలన్నారు. పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు, రూసా నోడల్ ఆఫీసర్ డా. టి.చంద్ర శేఖర్ మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ 2,8,9 యూనిట్ల ప్రోగ్రాం ఆఫీసర్లు డా.ఎస్.పి. వెంకటరమణ, డా.ఎస్.సుమిత్ర, డా.కె.శ్రీనివాసరావు ఎయిడ్స్ వ్యాధినిర్మూలనలో భాగస్వామ్యం అవుతామని వాలంటీర్లు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీ పరిపాలన భవనం నుంచి ప్రారంభమై విశ్వవిద్యాలయ ప్రధాన ద్వారం మీదుగా అంతర్గత రహదారుల్లో కొనసాగింది.

ప్రశాంతతకు నిలయం.. సర్వజనుల ఆలయం

సగిలేరు ఒడ్డున నిర్మించిన తెలుగుగంగ అక్విడెక్ట్ కాలువ సమీపంలోని ఆ నిర్మాణం ఎవరినైనా ఆకట్టుకుంటుంది. దగ్గరికి వెళ్లి చూస్తే అక్కడి ప్రశాంతత ఔరా అనిపిస్తుంది. అపురూపమైన నిర్మాణ శైలి మనస్సుకు హత్తుకుంటుంది. ఆ నిలయమే కలసపాడులోని పరిశుద్ధ పరిపేతురు పరిపౌలు ఆలయం.

- ఆకట్టుకుంటున్న పరిశుద్ధ పరిపేతురు పరిపౌలు నిలయం
- 137 ఏళ్ల చరిత్ర కలిగినా చెక్కు చెదరని భవనం
- డిసెంబర్ 2, 3వ తేదీల్లో కలసపాడులో తిరుణాల



కలసపాడులోని పరిశుద్ధ పరిపేతురు పరిపౌలు ఆలయం



ఆకట్టుకునే చర్చి లోపలి భాగం

కలసపాడు : కలసపాడు సగిలేరు ఒడ్డున పరిశుద్ధ పరిపేతురు పరిపౌలు ఆలయం ఆధ్యాత్మిక నిలయంగా విరాజిల్లుతోంది. 136 ఏళ్లు పూర్తి చేసుకున్న ఈ భవనంలో డిసెంబర్ 2వ తేదీన ప్రతిష్ట మహోత్సవాలు జరుపుకొనేందుకు సిద్ధమవుతోంది. 1884లో ప్రార్థనలు చేసేందుకు ఇంగ్లాండ్‌కు చెందిన రెవ.అర్థర్ ఇన్‌మన్ ఆధ్వర్యంలో ఈ చర్చి నిర్మాణం ప్రారంభించారు. మూడేళ్లు కష్టపడి అద్భుత ఆలయంగా దీనిని తీర్చిదిద్దారు. 1887 డిసెంబర్, 3న నిర్మాణం పూర్తయింది. 136 ఏళ్లు పూర్తవడంతో ఈ ఏడాది డిసెంబరు 2, 3వ తేదీల్లో ప్రతిష్ట ఉత్సవం, గుడి తిరుణాల జరుపనున్నారు. జిల్లా నుంచే కాక ఇతర జిల్లాల నుంచి లక్షల మంది భక్తులు ఉత్సవాలకు తరలివస్తారు.

ఆకట్టుకునే నిర్మాణం

ఆలయ నిర్మాణంలో వాడిన ఇటుకలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. స్థానికంగా దొరికే బంక మట్టి, ఇసుక, సున్నం, బెల్లం, లక్షల సంఖ్యలో కోడిగుడ్లను కలిపి గానుగ తిప్పి తయారు చేసిన గచ్చుతో భవనం నిర్మించారు. నునుపుదనం కోసం పైపూతలో కూడా గుడ్ల మిశ్రమాన్ని ఉపయోగించారు. ఆధునికత ఉట్టిపడేలా టేకు, తాటి చెక్కలతో కిటికీలు, తలుపులు తయారు చేశారు. కేరళ పెంకుతో పైకప్పు నిర్మించడంతో ఆకట్టుకునేలా పటిష్టంగా తయారైంది.

లక్షల్లో తరలిరానున్న భక్తులు

ఏటా గుడి తిరుణాలకు లక్షల్లో భక్తులు తరలివస్తారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచే కాక కర్నూలు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలతో పాటు దక్షిణాది రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. ప్రధాన కార్యక్రమమైన భోగి పండగకు కనీసం లక్ష మందికి పైగా భక్తులు హాజరవుతుంటారు. 3న ఉదయాన్నే భక్తులు తలనీలాలు సమర్పించి ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. స్వామికి భారీగా కానుకలు సమర్పించుకుంటారు. ఈ కార్యక్రమానికి వచ్చిన మిత్రులు, బంధువులకు విందులు ఇస్తారు.

చేరుకోవం ఇలా..

గుడి తిరుణాలకు వచ్చే భక్తులు రైలులో అయితే ప్రకాశం జిల్లాలోని గిద్దలూరు నుంచి రావచ్చు. గిద్దలూరు నుంచి కలసపాడుకు 33 కిలోమీటర్లు బస్సు సౌకర్యం ఉంటుంది. కడప జిల్లా కేంద్రం వరకు రైలులో వచ్చి అక్కడి నుంచి 95 కిలోమీటర్లు దూరంలో ఉన్న కలసపాడుకు బస్సులో రావచ్చు. నెల్లూరు జిల్లా నుంచి వచ్చేవారు ఉదయగిరి, బద్వేల్, పోరుమామిళ్ల మీదుగా కలసపాడుకు చేరుకోవచ్చు. కర్నూలు జిల్లా నుంచి వచ్చేవారు నంద్యాల, గిద్దలూరు మీదుగా చేరుకోవచ్చు.

ఆలయ ప్రత్యేకతలివీ..

ఆలయంలో నిర్మించిన గంటగోపురం, బాప్టిజం తొట్టె ప్రత్యేకమైనవి. చర్చి లోపల ముఖద్వారం వద్ద ఈ తొట్టె ఉంది. ఆలయంలోకి వచ్చే భక్తులు ఆ నీటిని చల్లుకుని బాప్టిజం పొందుతారు. సుదూర ప్రాంతాల నుంచి తమ పిల్లలకు బాప్టిజం ఇప్పించేందుకు భక్తులు ప్రతిష్టా మహోత్స వాలకు తరలివస్తారు. గుడి వెలుపల ఏర్పాటుచేసిన గంటను గడియారం లేని రోజుల్లో సమయాన్ని తెలిపేందుకు అక్కడి గంట మోగించేవారు. 40 అడుగుల ఎత్తులో నిర్మించిన ఈ గంట భక్తులను ఆకట్టుకుంటోంది.

ఫార్మసీ కళాశాలకు న్యాక్ గుర్తింపు

కడప ఎడ్యుకేషన్ : కడపలోని నిర్మలా కాలేజ్ ఆఫ్ ఫార్మసీకి ప్రతిష్టాత్మకమైన నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) బెంగళూరు వారి అనుబంధ గుర్తింపు లభించింది. ఈ విష యాన్ని ఆ కళాశాల ప్రిన్సిపాల్ యు.మోహన్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ గుర్తింపు 2024 విద్యా సంవత్సరం నుంచి ఐదేళ్లు వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. జూన్‌లో న్యాక్ సంస్థ ముగ్గురు నిపుణుల బృందాన్ని కళాశాలకు పంపించిందన్నారు. వారు కళాశాలలోని సౌకర్యాలు, విద్యా విధానం పరిశీలించారని చెప్పారు. సంతృప్తి చెంది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉన్నత విద్యాశాఖ ప్రశంసా పత్రం పంపిందని కళాశాల చైర్మన్ బి.శ్రీనివాసులు తెలిపారు. విద్యా నాణ్యతను ఇది తెలియజేస్తుందని ఆయన పేర్కొన్నారు.



న్యాక్ ప్రతాన్ని, చైర్మన్‌కు అందజేస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: డిసెంబర్ ఒకటవ తేదీన కందుకూరులోని విక్కిర్యాల పేట రోడ్డులో గల బాలాజీ ఫంక్షన్ హాల్లో ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్న విప్లవ విద్యార్థి సంస్థ పీడీఎస్‌యూ అర్థ శతాబ్ది ఉత్సవ సభను, పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు మనోజ్ కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శనివారం కడప నగరంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు హర్షవర్ధన్, జగదీశ్వర్‌రెడ్డి, సోమ్య, విజయ, సృజన, లక్ష్మీదేవి, అనురాధ, శిరీషా, గంగా తదితరులు పాల్గొన్నారు.

విద్య ద్వారా సమాజంలో గౌరవం



మాట్లాడుతున్న డాక్టర్ వనజ

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహిళలు ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా సమాజంలో గౌరవంతోపాటు హింసకు అడ్డుకట్ట వేయవచ్చని రిమ్స్ వైద్యురాలు డాక్టర్ వనజ తెలిపారు. శనివారం స్థానిక ఆర్డీ ఉమెన్ సెంటర్‌లో పలు అంశాలపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలబాలికలపై శారీరక, మానసిక హింసలు పెరగడం ఆందోళనకరమని తెలిపారు. వీటి నుంచి రక్షణ పొందేందుకు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ఆమె సైబర్ నేరాల నుంచి ఎలా బయటపడాలో తెలియజేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీ హోం సెక్రటరీ దుర్గాకుమారి, ఉమెన్‌సెంటర్ కో ఆర్డినేటర్ గీత తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పవర్ అల్తాఫ్ మామను పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని ఇంటర్నేషనల్ కళ్యాణమండపం సమీపంలో ఉంటున్న మాజీ కార్పొరేటర్ పవర్ అల్తాఫ్ మామ అనారోగ్యంతో బాధపడుతుండడంతో శనివారం సాయంత్రం మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఉప ముఖ్యమంత్రి వెంట పవర్ అల్తాఫ్‌తోపాటు కార్పొరేటర్లు చాక్లెట్ గౌస్, అలీ అక్బర్, మహమ్మద్ షఫీ, షంషీర్, మాజీ కార్పొరేటర్ మున్నా, నాయకులు దాసరి శివ, ఇబ్రహీంనియా, ఫయాజ్, మహబూబ్ ఖాన్, సద్దాం, ఆరిఫ్ ఉన్నారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపలో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించేలా సహకారాన్ని అందించాలని బ్యాంకు అధికారుల సంఘం నాయకులు శ్రీనివాసులు, సుజిత్, టీవీ సుబ్బారావులు కోరారు. శనివారం ఈ మేరకు వారు నంద్యాలలో మంత్రి ఫరూక్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని తరలిస్తే తలెత్తే ఇబ్బందులను గుర్తించి కడపలోనే కొనసాగేలా ప్రభుత్వానికి తెలియజేయాలని వారు కోరారు. కడపలోని ప్రధాన కార్యాలయం ద్వారా గ్రామీణ బ్యాంకింగ్ సేవలకు మద్దతు ఇవ్వడం, స్థానిక సంఘాలను బలోపేతం చేయడం, రాయలసీమ ప్రాంతీయ, ఆర్థికాభివృద్ధికి తోడ్పడటంలో కీలకపాత్ర పోషిస్తోందని తెలిపారు. ఈ విషయమై మంత్రి మాట్లాడుతూ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి బ్యాంకు ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

ఆంగ్లభాషపై పట్టుసాధిస్తే అపార అవకాశాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా

వైవీయూ: విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టుసాధిస్తే అపార ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా పేర్కొన్నారు. శనివారం కళాశాలలో ఆంగ్లశాఖ ఆధ్వర్యంలో 'ఎంప్లాయిబిలిటీ స్కిల్ నీడ్ ఆఫ్ ది అవర్'అన్న అంశంపై ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్పోకన్ ఇంగ్లీషు ద్వారా కార్పొరేట్, టెలికాం రంగాల్లో చక్కటి ఉద్యోగ అవకాశాలు ఉన్నాన్నారు. అనంతరం ముఖ్యవక్తలుగా విచ్చేసిన అధ్యాపకులు డాక్టర్ బాబు, టి.వి. అరవింద్, డా. బి. కేశవరెడ్డిలు ఇంగ్లీషుభాష ప్రాధాన్యతను, నైపుణ్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీరామరెడ్డి, అధ్యాపకులు విజయలక్ష్మీదేవి, గురుమోహన్ రెడ్డి, ప్రకాష్ నారాయణ రెడ్డి, సుజాత, ఆశాలత, అజ్మతుల్లా, రాజా నారాయణ, విద్యార్థినులు పాల్గొన్నారు.